క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య : జీవీఎంసీ 52వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ గురువారం పర్యటించారు. మర్రిపాలెం ఉడా లే అవుట్ లలితా డివైట్ గ్రీన్ బెల్ట్, సంజీవయ్యనగర్, అపర్ణా అపార్ట్‌మెంట్ సమీపంలో గ్రీన్ బెల్ట్‌లో జరుగుతున్న కళావేదిక అభివృద్ధి పనులు పరిశీలించారు. అదే విధంగా శాంతినగర్ పార్కు, ఓల్డ్ కరాస పార్క్‌లో, ఉడా లే అవుట్ పరిధి శివశివాని స్కూల్ ప్రాంగణంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ వార్డులో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం ఏఈ ఉషారాణి, హార్టీకల్చర్ ఏఈ అర్చన, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాల కృష్ణ, పారిశుధ్య విభాగం అధికారి మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

- కాపాడిన ఆర్పీఎఫ్ కానిస్టేబుల్



మహిళను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఆర్పీఎఫ్ పోలీసులు

గోపాలపట్నం: ఆత్మహత్య చేసుకునేందుకు సింహాచలం రైల్వేస్టేషన్‌కు వచ్చిన ఓ వివాహితను ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ కాపాడారు. వివరాలివీ.. రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం–1పై బుధవారం మధ్యాహ్న సమయంలో బుచ్చిరాజుపాలెం సుసర్ల కాలనీకి చెందిన కంచిమోజు అఖిల అనే వివాహిత అనుమానాస్పదంగా సంచరిస్తోంది. ఇది గమనించిన ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ కె.అనిత ఆమె వద్దకు చేరుకుని ప్రశ్నించారు. అనంతరం స్టేషన్‌కు తీసుకెళ్లగా.. ఏఎస్‌ఐ కె.ఆర్.కె.రావు ఆమె నుంచి వివరాలు సేకరించారు. కుటుంబ సమస్యల వల్ల ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చానని, తిరిగి ఇంటికి వెళ్లనని ఆమె తెలిపింది. దీంతో పోలీసులు ఆమె సోదరి కర్రి లీనాకు సమాచారం ఇచ్చారు. ఆమె సింహాచలం రైల్వే స్టేషన్‌కు వచ్చి ఆమెకు ధైర్యం చెప్పారు. మధ్యాహ్నం రెండు గంటలకు భర్త జగదీష్ సమక్షంలో ఆమెను సోదరి లీనాకు అప్పగించారు. సకాలంలో స్పందించి తన సోదరిని కాపాడిన పోలీసులకు లీనా కృతజ్ఞతలు తెలిపారు.

సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం

విశాఖ విద్య : కాలనీల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నట్లు కార్పొరేటర్ బొమ్మిడి రమణ అన్నారు. జీవీఎంసీ 90వ వార్డు పరిధిలోని సీతారామరాజు నగర్‌లో శివాలయాన్ని అనుకుని సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులకు ఆయన స్థానికులతో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. బుచ్చిరాజుపాలెం ఏపీఎస్‌ఈబీ కాలనీ వరకు డ్రెయిన్లు ఆధునికీకరించేలా రూ.19 లక్షలు జీవీఎంసీ నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ పబ్లిక్ వర్క్స్ ఏఈ వెంకట లక్ష్మి, సీతారామరాజు నగర్ రెసిడెన్షియల్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరాజు, జీవీఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

భయాందోళనలు తొలగించాలి

అగనంపూడి: కేంద్ర ప్రభుత్వం వైఖరి, ఉక్కు యాజమాన్యం నిర్లక్ష్యధోరణి వల్ల విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికుల్లో భయాందోళనలు నెలకొన్నాయని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు బొడ్డు పైడిరాజు, యు.రామస్వామి, పరంధామయ్య అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల నేతృత్వంలో 1,330వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. కార్మిక ప్రతినిధులతో కనీసం చర్చించకుండా యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలు తీసుకొంటుందన్నారు. దీని వల్ల ఆర్థిక నష్టం కల్గించడంతోపాటు మానసిక ఆందోళనకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సిటూ నాయకులు కె.గంగాధర్, పెదిరెడ్ల నీలకంఠం, వి.ప్రసాద్, ఆర్.వెంకట్రావు పాల్గొన్నారు.

జయహో జగన్మాత



కొత్తపాలెం ఆలయంలో బాలాత్రిపుర సుందరీదేవి



మల్కాపురం గొల్లవీధిలో బాలాత్రిపుర సుందరిగా దుర్గమ్మ

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
దుర్గమ్మకు భక్తుల విశేష పూజలు



గణపతినగర్‌లో దుర్గాదేవికి పూజలు

గోపాలపట్నం: నియోజకవర్గంలో గురువారం దుర్గాదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో మండపాలు ఏర్పాటు చేసి అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. తొలి రోజు బాలా త్రిపురసుందరీ దేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. స్థానిక గవర వీధిలో యంగ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన శరన్నవరాత్రి పూజల్లో స్థానిక భక్తులు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు శరగడం అరుణ్‌కుమార్, సాయి, మోహన్, రామకృష్ణ, జయరామ్ శేఖర్, లోకేష్, కైలాష్ భక్తులకు ప్రసాదం అందించారు.

- 89వ వార్డు కొత్తపాలెం గణపతినగర్‌లో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, డీకే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దొడ్డి కిరణ్ దంపతులు పాల్గొని కుంకుమ పూజలు చేశారు. గ్రామ పెద్దలు దొడ్డి సూర్యారావు, ఆడారి జగ్గారావు, గురునాథరావు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.
- కొత్తపాలెం దుర్గాదేవి ఆలయంలో ఉదయం నుంచి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి మూల విరాట్‌ను విశేషంగా అలంకరించారు. అధిక సంఖ్యలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు.



దుర్గానగర్ ఆలయంలో కలశ ప్రతిష్ఠ చేస్తున్న పల్లా సత్యనారాయణ దంపతులు

పులకించిన పారిశ్రామిక ప్రాంతం

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా మొదలయ్యాయి. భవానీ భక్తులు అమ్మవారి మాల ధరించారు. ఆయా ప్రాంతాల్లో మండపాలు ఏర్పాటు చేసి దుర్గమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. 61వ వార్డు మల్కాపురం గొల్లవీధిలో విజ్ఞాన మండలి యాదవ సంఘం వద్ద డేరింగ్ అండ్ డాషింగ్ యూత్ ఆధ్వర్యంలో అమ్మవారిని నెలకొల్పి బాలాత్రిపుర సుందరిగా అలంకరించారు. పదేళ్ల వయసు లోపు చిన్నారులను మండపం వద్దకు పిలిచి అమ్మవారి ప్రసాదం, గాజులు, పసుపు కుంకుమలను అందించి, వారి ఆశీర్వచనాలను భక్తులు తీసుకున్నారు. ఇదే వార్డు పల్లి వీధిలో సాయి ట్రస్టు ప్రతినిధి శ్వేతయాదవ్ నూనెల తన ఇంటి వద్ద దుర్గాదేవి పీఠం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు.

- 59వ వార్డు గాజువాక ఆర్టీసీ డిపో వద్ద దుర్గాదేవి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, డిపో ఎస్‌ఎంయూ ప్రధాన కార్యదర్శి పి.శంఖరరావు, టీడీపీ 58వ వార్డు అధ్యక్షుడు కోరాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.
- ఇదే వార్డు రామ్‌నగర్ వద్ద స్థానిక యూత్ ఆధ్వర్యంలో మండపంలో జరిగిన పూజల్లో ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.
- 60వ వార్డు శ్రీహరిపురం జవహర్‌నగర్‌లో స్థానిక యువకులు అమ్మవారి పీఠం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



శివాలయంలో అమ్మవారికి పూజలు



గవర వీధిలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న మహిళలు

బాలాత్రిపుర సుందరిగా సాగరదుర్గ
షిప్‌యార్డ్ సమీప సాగరి కనకదుర్గాదేవిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

స్వర్ణ కవచ దుర్గమాంబ

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు దుర్గానగర్ దుర్గమాంబ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వి.వి.ఎల్.సుబ్రహ్మణ్యశర్మ నేతృత్వంలో గొల్లకంచరపాలెం శ్రీరామా సేవా సమాజం గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ దంపతులు కలశ ప్రతిష్ఠ చేశారు. స్వర్ణ కవచ దుర్గాదేవికి భక్తులు క్షీరాభిషేకం నిర్వహించారు. అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించి పంచామృతాభిషేక పూజలు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

విశాఖ విద్య : జీవీఎంసీ 52, 90వ వార్డుల పరిధిలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రత్యేక మండపాలను అందంగా తీర్చిదిద్ది అమ్మవారి విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు చేశారు. 90వ వార్డు బుచ్చిరాజుపాలెం శ్రీదుర్గాలమ్మ – బంగారమ్మ అమ్మవారికి విశేష పూజలు జరిపించారు. మహిళలు సామూహిక పూజలు చేశారు. సీతారామరాజు నగర్ శ్రీ పార్వతీ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఇచ్ఛాపు నాగేంద్ర, కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు ఏర్పాట్లు చేశారు. ఏపీఎస్ఈబీ కాలనీ శ్రీషిర్డీ సాయి మందిరంలో ప్రత్యేక మండపంపై అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు విళ్లా సత్యనారాయణ రావు, కోశాధికారి సుబ్బారావు ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు.



సాయి మందిరంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



గాజువాక డిపో వద్ద దుర్గాదేవిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



పల్లి వీధిలో కొలువైన అమ్మవారు

40, 63 వార్డుల్లో..

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీలోని నూకాంబిక అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ముఖ్య అతిథి కార్పొరేటర్, ఆలయ ధర్మకర్త గుండపు నాగేశ్వరరావు అమ్మవారికి పూజలు చేశారు. స్థానిక భక్తులు పాల్గొన్నారు.

- 63వ వార్డు క్రాంతినగర్ వినాయకుడి గుడి వద్ద శ్రీ కనకదుర్గా పూజా కమిటీ ఆధ్వర్యంలో దుర్గమ్మను నెలకొల్పి విశేషంగా అలంకరించారు. భవానీ మాలాధారులు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజలు, ప్రత్యేక అభిషేకాలు చేశారు.
- 63వ వార్డు కాకరలోవ, చింతల్లోవ, క్రాంతినగర్ డబుల్ ట్యాంక్ వద్ద నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో ఎమ్మెల్యే గణబాబు, కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు గల్లా చిన్నా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. జెర్రిపోతుల నర్సింగరావు, పుక్కల కృష్ణ, ధర్మ, బాబూరావు, బొండా కృష్ణ, కనక, సందాని, గోవింద్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



63వ వార్డులో దుర్గాదేవికి పూజలు చేస్తున్న భక్తులు

ఇష్టానుసార పార్కింగ్‌తో ఇబ్బందులు



రైల్వే స్టేషన్ ప్రహరీని ఆనుకుని పార్క్‌చేసిన వాహనాలు

గోపాలపట్నం: రహదారులపై ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. స్థానిక రైల్వే స్టేషన్ వద్ద ప్రహరీ గోడకు ఆనుకుని కార్లు, అడ్డదిడ్డంగా ద్విచక్ర వాహనాలు నిలిపివేయడం వల్ల ఈ దారిలో ప్రయాణించే వాహన చోదకులు, పాదచారులు నరకయాతన పడుతున్నారు. గతంలో గోపాలపట్నం ట్రాఫిక్ పోలీసులు ఈ రహదారిలో వాహనాలు నిలరాదని నిబంధన పెట్టినా.. అది కొద్ది రోజులు మాత్రమే అమలైంది. అప్పటి ఎస్ఐ శ్రీనివాసరావు బదిలీపై వెళ్లిపోయిన తరువాత దీనిపై ట్రాఫిక్ అధికారులు దృష్టి పెట్టక పోవడంతో షరా మామూలుగా మారిపోయింది. రైళ్లు వచ్చిన సమయంలో కూడా ప్రయాణికులు వెళ్లేందుకు కూడా దారి ఇవ్వని పరిస్థితి ఏర్పడుతోంది. పార్కింగ్‌లో పెడితే డబ్బులు కట్టాలన్న ఉద్దేశంతో చాలా మంది బయట వాహనాలు పెడుతున్నారని, వాటివల్లే ఈ పరిస్థితి ఏర్పడుతోందని పలువురు వాపోతున్నారు. ట్రాఫిక్ అధికారులు దృష్టి సారించి, రైల్వే పోలీసుల సహకారంతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మల్కాపురం : పనికి వెళ్లమని భార్య చెప్పడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం, శెట్టిబలిజ వీధిలో పిల్లా సన్యాసిరావు (50) భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి కొంత కాలం నుంచి నివసిస్తున్నాడు. ఇతని రెండో భార్య, కుమార్తె కాకినాడలో నివసిస్తున్నారు. సన్యాసిరావు స్థానిక మార్కెట్‌లోని చికెన్ షాపులో పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కొంత కాలంగా పనికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో పనికి వెళ్లకుంటే ఇల్లు ఎలా గడుస్తుందని భార్య బుధవారం వాదించింది. దీంతో మనస్తాపానికి గురైన సన్యాసిరావు ఇంటి నుంచి వచ్చేసి మల్కాపురం మెయిన్ రోడ్డులోని హెచ్‌పీసీఎల్ రక్షణ గోడకు ఆనుకుని ఉన్న చెట్టు కొమ్మకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ మార్గంలో గురువారం ఉదయం వెళ్లిన కార్మికులు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మల్కాపురం సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో సిబ్బంది కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెచ్చిపోతున్న గంజాయి బ్యాచ్

- మత్తులో ఒంటరి మహిళలతో దురుసు ప్రవర్తన
- బెంబేలెత్తిపోతున్న జీవీఎంసీ 51, 52 వార్డుల ప్రజలు
- పోలీసుల రాత్రి గస్తీ ఉన్నా.. ప్రయోజనం శూన్యం

మర్రిపాలెం : జీవీఎంసీ 51, 52వ వార్డుల పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో గంజాయ్ బ్యాచ్ రెచ్చిపోతోంది. జులాయిగా తిరిగే యువకులతో కూడిన ఈ బ్యాచ్‌లు నిత్యం గొడవలు, నేరాలకు పాల్పడుతున్నాయి. ముఖ్యంగా ఒంటరిగా రోడ్లపైకి వచ్చేందుకు మహిళలు హడలిపోతున్నారంటే పరిస్థితి ఎంత భయానకంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అనేక ఘటనల్లో స్థానిక కాలనీల ప్రజలు ఫిర్యాదు చేస్తున్నప్పటికీ కఠిన చర్యలు తీసుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నారు. గంజాయి నిర్మూలన పేరుతో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం హడావిడి చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. చీకటి పడగానే వంశీనగర్, సీతన్న గార్డెన్స్, మాధవధార స్వామి ఆలయానికి వెళ్లే దారిలో గంజాయి మూకలు రెచ్చి పోతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

చీకటిపడగానే మత్తులోకి జారుకుంటూ...

వంశీనగర్ కమ్యూనిటీ హాల్ గోడకు ఆనుకుని వెనుకాల సుమారు ఏడు నుంచి 10 అడుగుల మేర స్థలం కూర్చునేందుకు వీలుగా ఉంది. ఆ స్థలానికి ఆనుకుని ఓ ప్రధాన గెడ్డ కూడా ఉంది. చీకటి పడగానే అక్కడకు కొంత మంది చేరుకుని గంజాయి, మద్యం సేవిస్తూ పక్కనే ఉన్న గెడ్డలో ప్యాకెట్లు, ఖాళీ సీసాలు విసిరేస్తున్నారు. మరోవైపు జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్డులో కూతవేటు దూరంలో ఉన్న డీ మార్ట్ సూపర్ మార్కెట్ నుంచి వంశీనగర్ ప్రధాన గెడ్డకు వచ్చే దారిలో చీకటిలో చెట్ల మాటున కొందరు ఆకతాయిలు గంజాయి సేవిస్తున్నారు. ఆ సమయంలో అటుగా వెళ్లే ఒంటరి మహిళలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇటీవల స్థానికంగా ఓ మహిళను అలాగే వెంబడించడంతో ఆమె భయంతో ఇంటికి పరుగులు తీసింది. కొందరు జులాయిలకు గంజాయి మత్తు ఎక్కువైతే ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారిని దారికాచి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మాధవస్వామి ఆలయానికి వెళ్లేందుకు కూడా రాత్రి వేళల్లో భయపడుతున్నామని వాపోతున్నారు.

గంజాయి మత్తులో దొంగతనాలు

మరోవైపు వంశీనగర్ కాలనీలో బైకుల్లో నుంచి పెట్రోల్, ఇంటి ముందున్న బకెట్లు, దుస్తులు, ఏసీ పరికరాలు కూడా ఇటీవల అపహరణకు గురయ్యాయని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల వంశీనగర్ సాయిబాబా ఆలయ హుండీ పగలగొట్టేందుకు ఆకతాయిలు యత్నించినప్పటికీ... అదే సమయంలో స్థానికులు గణపతి నిమజ్జనోత్సవం ముగించుకుని వస్తుండడంతో చూసి పరుగులు తీశారు. మరోవైపు పోలీసులు రాత్రి పూట గస్తీ నిర్వహిస్తున్నా ఉపయోగం లేదని, వారు వచ్చే సమయానికి ఆకతాయిలు మాయమైపోతున్నారని స్థానికులు అంటున్నారు. మెయిన్ రోడ్డులో గస్తీ నిర్వహించడం వల్ల ఉపయోగం లేదని, పోలీసుల బైక్ శబ్దానికి గంజాయి బ్యాచ్ జారుకుంటున్నారని, అణువణువూ జల్లెడపట్టేలా గస్తీ నిర్వహించాని కాలనీల వాసులు కోరుతున్నారు. పోలీసులు పూర్తి స్థాయిలో దృష్టి సారించి గంజాయి బ్యాచ్ ఆగడాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.



రాత్రి వేళల్లో గంజాయి, మద్యం సేవించేది ఇక్కడే

ప్రమాదకరంగా గొయ్యి



గోపాలపట్నం శ్మశానవాటిక సమీప రహదారిలో ఏర్పడిన గొయ్యి

గోపాలపట్నం: గోపాలపట్నం శ్మశానవాటిక సమీపంలో రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డులో గొయ్యి ఏర్పడింది. ఇక్కడి కాలువపై ఏర్పాటు చేసిన సిమెంట్ పలకలు ధ్వంసమై ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో ఈ గొయ్యి స్థానిక వాసులకు, వాహన చోదకులకు ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డు మీదుగా సింహాచలం రైల్వే స్టేషన్, కొత్తపాలెం, నరవ, ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది. ఈ గోతిలో పడి చాలా మంది ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ గొయ్యిని గుర్తించేందుకు ట్రాఫిక్ పోలీసులు ఇక్కడ కర్రలు, చెట్టు కొమ్మలు పెట్టారు. రద్దీ సమయాల్లో కార్లు, ఆటోలు ఈ గోతిలో ఇరుక్కు పోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. వాహన చోదకులు ఆదమరిచి ప్రయాణిస్తూ గోతిలో పడి గాయపడే అవకాశముంది. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే బాగు చేయాలని కోరుతున్నారు.

గాంధీ తత్వంతోనే సమస్యలకు పరిష్కారం

మద్దిలపాలెం: సమాజంలో ఎదురవుతున్న సమస్యలకు గాంధీ తత్వంలోనే పరిష్కార మార్గాలు చూపవచ్చని వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆంధ్రా యూనివర్సిటీలోని గాంధీ అధ్యయన కేంద్రంలో ఏయూ న్యాయ కళాశాల నిర్వహిస్తున్న ఇష్యూస్ అండ్ చాలెంజెస్ ఆఫ్ జెండర్ జస్టిస్ అండ్ ఈక్వాలిటీ ఏ గాంధీయన్ పరెస్పెక్టివ్ రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏయూ విశ్రాంత రెక్టార్ ఎ.ప్రసన్న కుమార్ మాట్లాడుతూ గాంధీజీ దేశ ప్రజలను ఐక్యం చేసి స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపించిన విధానాన్ని వివరించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంతి ఉప కులపతి ఆచార్య వి.బాలమోహన్ దాష్ మాట్లాడుతూ గాంధీజీలోని నాయకత్వ లక్షణాలు యువతకు ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. గాంధీ అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య కె.సీతామాణిక్యం మాట్లాడుతూ సత్యం, అహింసా, ఓర్పు అనే అంశాలను వివరించారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహరావు, న్యాయ కళాశాల ప్రొఫెసర్ వి.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

మూడో రోజుకు రిలే దీక్షలు




పోర్టు హాస్పిటల్ వద్ద రిలే నిరాహారదీక్షలో సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం : పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆస్పత్రి ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కే ఎస్వీ కుమార్ మాట్లాడుతూ పోర్టు యాజమాన్యం వద్దే సొంత నిధులు వేల కోట్ల రూపాయలు ఉన్నాయని, స్వయంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. విశాఖ నగరం ఇలా విస్తరించడానికి పోర్టు కూడా కారణమన్నారు. ప్రస్తుతం రూ.386 కోట్ల లాభాలతో నడుస్తోందని, సుమారు రూ.171.42 కోట్లు పన్నుల రూపంలో కడుతోందని తెలిపారు. పోర్టు హాస్పిటల్‌ను రక్షించుకునే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. రిలే నిరాహార దీక్షలో జె.సత్యనారాయణ, కె.సత్యనారాయణ, ఈశ్వరరావు, శ్రీను, బి.జగన్, కనకారావు, అప్పలనర్సమ్మ, ధనలక్ష్మి, పైడమ్మ, వీఎస్ మూర్తి, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

6న ఫిల్మ్ సొసైటీ సమావేశం

మద్దిలపాలెం: ఈ నెల 6న డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల ప్రాంగణంలోని గాంధీ సెంటర్ హాల్‌లో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ వార్షిక సమావేశం నిర్వహించనున్నట్లు సొసైటీ కార్యదర్శి ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి



కప్పరాడలో నిరశన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

కంచరపాలెం : స్థానిక కంచరపాలెం కప్పరాడ కొండవాలు ప్రాంతంలో గురువారం సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు నిరశన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్, సీపీఎం కార్యదర్శి బొట్టా ఈశ్వరమ్మ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు పనులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్మికులకు పట్టణ ఉపాధి హామీ పథకం మంజూరు చేయాలని కోరారు. ఉచిత ఇసుక జీవోలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు, గుర్తింపు కార్డులు ప్రభుత్వం వెంటనే ఇవ్వాలన్నారు. ఉచిత ఇసుక విషయంలో ప్రభుత్వం ద్వంద్వ వైఖరి విడిచి సక్రమంగా సరఫరా చేస్తే కార్మికులకు పనులు దొరుకుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎ.చంటి, ఒమ్మి అప్పారావు, ఎం.ఈశ్వరరావు, కె.సత్యనారాయణ, రాముునాయుడు పాల్గొన్నారు.